క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.19, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చి మిర్చి 55, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్ 45, పచ్చ కాకర 45, పందిరి బీర 40, క్యాబేజీ 11, క్యారెట్ 19, దొండ 35, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 28, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 17, చామ గడ్డ 55, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటి కాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 3–5.

కనుల పండువగా వీరభద్ర స్వామి కల్యాణం

రసూల్‌పురా: కంటోన్మెంట్ తిరుమలగిరి విలేజ్ చంద్రగిరి కాలనీలోని వీరభద్ర స్వామి ఆలయం వార్షికోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హోమం, అగ్నిగుండం, తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ గణేష్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ గణేష్ స్వామివారి కల్యాణం, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరేశం, శివప్రసాద్ శర్మ, పరమేశ్వర స్వామి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



అమీర్‌పేట: సనత్‌నగర్ డివిజన్ కేఎల్ఎన్‌వై మున్సిపల్ పార్కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా శ్రీనివాస్‌రావు, అధ్యక్షులు రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ముఖేష్, కోశాధికారి రాజుగౌడ్‌ను ఎన్నుకున్నారు. వీరితో పాటు సలహాదారు, ఉపాధ్యక్షులు, ఆర్గనైజింగ్ సెక్రటరీలను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. పార్కును అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుంటామని వాకర్స్‌కు ఎలాంటి సమస్య తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

ఏషియా పవర్ లిఫ్టింగ్ పోటీలకు రవిసింగ్ బిడ్లాన్ ఎంపిక



సనత్‌నగర్: ఏషియా పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు తెలంగాణ నుంచి సనత్‌నగర్ వాల్మీకి వ్యాయామశాల కు చెందిన రవిసింగ్ బిడ్లాన్ ఎంపికయ్యారు. కేరళ రాష్ట్రంలో మే 1 నుంచి 6 వరకు జరిగే పోటీలకు ఆసియా వ్యాప్తంగా 12 దేశాలు పాల్గొంటాయి. ఈ చాంపియన్‌షిప్‌లో రవిసింగ్ బిడ్లాన్ 105 కేజీల విభాగంలో తలపడనున్నారు.

మసీదుల వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తాం



కమిటీ సభ్యులతో సమావేశమైన శ్రీలతా శోభన్‌రెడ్డి

లాలాపేట: త్వరలో ప్రారంభం కానున్న రంజాన్ మాసం నేపథ్యంలో పండుగ నిర్వహణకు ప్రభుత్వ పరంగా అన్ని ఏర్పాట్లు చేస్తామని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తార్నాకలోని ఆమె కార్యాలయంలో పలువురు మజీద్ కమిటీ నాయకులు కలిసి ఆయా మసీదుల వద్ద చేపట్టాల్సిన సౌకర్యాలపై వినతి పత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అన్ని పండుగలను ప్రభుత్వం అధికారికంగా పెద్ద ఎత్తున నిర్వహిస్తుందన్నారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు ఏలాంటి అసౌకర్యాలు లేకుండా అన్ని మసీదుల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మోతే శోభన్‌రెడ్డి, పాషా, యూకూబ్ పాల్గొన్నారు.

తప్పిపోయిన శునకం అప్పగింత

లాలాపేట: తప్పిపోయిన ఓ పెంపుడు కుక్కను యజమానికి అప్పగించిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్–1 ఉంటున్న ఆదిత్య పెంపుడు కుక్క ఈ నెల 17న ఇంట్లో నుంచి తప్పిపోయింది. ఇష్టంగా పెంచుకుంటున్న కుక్క ఎంతకూ రాకపోవడంతో ఓయూ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరాల ఆధారంగా ఆ కుక్క తార్నాక వైపు వెళ్తుండగా ఓ వ్యక్తి దాన్ని పట్టుకుని ఆటోలో మౌలాలి ఆర్టీసీ కాలనీకి తీసుకెళ్లాడు. ఆటో నెంబర్ ఆధారంగా ఆ కుక్కను పట్టుకుని యజమానికి అప్పగించారు. తన కుక్కను అప్పగించడంతో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

త్వరలోనే రాష్ట్రంలో రాజన్న రాజ్యం

పంజగుట్ట: త్వరలోనే రావణ పాలన నుంచి విముక్తి పొంది రాజన్న రాజ్యం స్థాపిద్దామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఆదివారం బీఎస్ మక్తాలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలను కలిసి ప్రభుత్వ వైఫల్యాలపై వివరించడంతో పాటు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేయబోయే కార్యక్రమాల గురించి వివరించారు. ఆమె మాట్లాడుతూ.. ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని, స్థానిక ఎమ్మెల్యే వాటిని పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



పనుల్లో ఆలస్యం!

- నత్తనడకన కట్టెలమండి రోడ్డు పనులు
- రాకపోకలకు ఇబ్బందులు
- దృష్టి సారించని అధికారులు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బన్సీలాల్‌పేట్ డివిజన్ కట్టెల మండి ప్రాంతంలో కొనసాగుతున్న రోడ్డు పనుల కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం, జలమండలి అధికారుల మధ్య సమన్వయ లేక పనులు నత్తనడకన సాగుతూ రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. సుమారు 40 రోజుల నుంచి ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారి ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఇక్కడ పనులు ఒక్కడుగు ముందుకు రెండడుగులు వెనక్కు అన్నట్టుగా సాగుతున్నాయి. ఫిబ్రవరి 10న బోయిగూడ ఏ–1 మటన్ షాపు నుంచి కట్టెల మండి వరకు ప్రారంభమైన పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

రోడ్డంతా మురుగు నీరే..

రోడ్డుపై తవ్వకాలు కారణంగా ప్రజలు రాకపోకలు సాగించడం కష్టతరమవుతోంది.సుమారు 40 రోజుల నుంచి స్థానికులు నరకం చూస్తున్నారు. రోడ్డు తవ్వకాల సమయంలో సంబంధిత విభాగం సిబ్బంది దగ్గర లేకపోవడం కారణంగా డ్రైనేజీ, మంచినీటి పైపులైన్లు దెబ్బతిన్నాయి. దీంతో స్థానికులు



రోడ్డును తవ్వి వదిలేశారిలా..

మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ మురికినీరు రోడ్డుపై ఏరులై పారుతుంది. కట్టెల మండి ప్రాంతంలో డ్రైనేజీ మురికినీరు చిన్నపాటి చెరువును తలపిస్తోంది. దీంతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డంతా తవ్వడంతో చుట్టూ తిరిగి రావాల్సిన దుస్థితి ఏర్పడింది. ముఖ్యంగా ఉదయం సాయంత్రం, విద్యార్థులు, ఉద్యోగులు నానా తంటలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు.

త్వరలోనే పూర్తి చేస్తాం

కట్టెలమండి ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనుల్లో సాంకేతిక కారణాల వల్ల కొంత జాప్యం జరుగుతున్న మాట వాస్తవమే. అయితే అక్కడ డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆ పనులు పూర్తయిన వెంటనే రోడ్డు పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తాం.

–నవీన్, ఏఈ

మంత్రి ఆదేశించినా..

రోడ్డు నిర్మాణ కారణంగా మంచినీటి, డ్రైనేజీ పైపులైన్లు ధ్వంసం కావడంతో నీటి ఎద్దడితో పాటు కలుషిత జలాల సమస్యను ఎదుర్కొంటున్నారు. కట్టెల మండి రోడ్డు నిర్మాణ కారణంగా బోయిగూడ, జయప్రకాష్‌నగర్, కీస్‌బ్లాక్, అమ్ముగూడ, ఐడీహెచ్ కాలనీ, ఉప్పలమ్మ దేవాలయం పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. రోడ్డు నిర్మాణ విషయమై ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి విన్నవించినా ఫలితంగా లేకుండా పోయిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఈ ప్రాంతాన్ని సందర్శించి వెంటనే రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించినా అధికారుల్లో మాత్రం చలనం లేకపోవడం విడ్డూరం. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రోడ్డు పనులను పూర్తిచేయాలని కోరుతున్నారు.

40 ఏళ్లలో కాని అభివృద్ధి 9 ఏళ్లలోనే..



మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

అల్లావుద్దీన్ కోఠి సమావేశంలో మంత్రి తలసాని

సనత్‌నగర్: నలభై ఏళ్లలో కాని అభివృద్ధి తెలంగాణలో కేవలం తొమ్మిదేళ్లలో జరిగిందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. సనత్‌నగర్‌లోని అల్లావుద్దీన్ కోఠిలో ఆదివారం ఆయన పర్యటించి బస్తీ అభివృద్ధి నూతన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత వందల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టి దీర్ఘకాలిక సమస్యలను సైతం పరిష్కరించడం జరిగిందన్నారు. గతంలో ఎమ్మెల్యేగా గెలుపొందిన వ్యక్తి ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటికీ ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాతనే ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు సహకారంతో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అల్లావుద్దీన్ కోఠి ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, మంచినీరు, రోడ్లు వంటి అనేక సమస్యలను పరిష్కరించానన్నారు. బస్తీ ప్రజల రేషన్ కోసం వేరే ప్రాంతానికి వెళ్లి తెచ్చుకునేందుకు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అల్లావుద్దీన్‌కోఠిలోనే రేషన్ పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవడం జరిగిందని, అందుకు సంబంధించిన ఆర్డర్ కాపీని బస్తీ అధ్యక్షుడు అబ్దుల్ కరీం లాలకు అందజేశారు. ఈ సందర్భంగా బస్తీవాసులు అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరగా, వెంటనే మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఇక్కడే ఉంటున్నవారికి ఇళ్ల స్థలాల పట్టాలను ఇప్పించడంలో గతంలో ఇక్కడ నుంచి ప్రాతినిథ్యం వహించిన నేతలు విఫలమయ్యారని రాష్ట్రం వచ్చిన తర్వాత పట్టాలు ఇస్తామని అంటే అది ఎలా సాధ్యమవుతుందని హేళన చేశారని, అత్యధిక శాతం మందికి పట్టాలు అందజేసి తాము ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని మంత్రి గుర్తు చేశారు. తమ సమస్యలు పరిష్కరిస్తారని నియోజకవర్గ ప్రజలు ఎంతో నమ్మకంతో మర్రి శశిధర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. నేడు మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజల్లో ఎంతో చైతన్యం వచ్చిందని మళ్లీ మోసపోయే పరిస్థితుల్లో లేరన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, నాయకులు సురేష్‌గౌడ్, ఖలీల్‌బేగ్, పురుషోత్తం, షబానా, ఇర్ఫాన్, ఆసిఫ్‌ఖాన్, యాసీన్, ఫాజల్, సురేందర్ పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా ఉంటా..

అమీర్‌పేట: నిరుపేద ప్రజలకు నిరంతరం అండగా ఉంటానని మంత్రి తలసాని అన్నారు. నూతనంగా నియామకమైన దాసారం బస్తీ గుడిసె వాసుల సంక్షేమ సంఘం అధ్యక్షులు టి.తిమ్మన్న సభ్యులతో కలిసి ఆదివారం మంత్రిని కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడిసెల్లో మౌలిక సదుపాయాలు కల్పించామని, అందరు సమష్టిగా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. మంత్రిని కలిసిన వారిలో సురేష్, ఆదినారాయణ, తిరుమలయ్య, రవికుమార్, శ్రీనివాసులు,శివ,రాజు,ఈశ్వర్ ఉన్నారు.

కౌన్సెలింగ్ కేంద్రాల ఏర్పాటు అవసరం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధ

అమీర్‌పేట: భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రాకుండా ఉండాలంటే పెళ్లికి ముందే పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చే కేంద్రాల ఏర్పాటు అవసరమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధ అన్నారు. అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో అమీర్‌పేట గ్రీన్‌పార్కు హోటల్‌లో ఆదివారం నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. గతంలో పెళ్లి చేయాలనుకుంటే అబ్బాయి మంచోడా ఏదైనా పని చేస్తున్నాడా అని చూసే వారని, కానీ.. నేడు తల్లిదండ్రులకు ఒక్కడే ఉండాలి, అమెరికాలో ఉద్యోగం ఉండాలని చూస్తున్నారని తెలిపారు. చిన్న చిన్న సమస్యలను సర్దుబాటు చేసుకోకుండా కొందరు జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత ఉద్యోగాలు చేస్తూ ఎంతో విజయవంతం అవుతున్న యువతీ యువకులు కుటుంబ సమస్యలను అధిగమించలేకపోతున్నారన్నారు. కోల్పోతున్న భారతీయ కుటుంబ వ్యవస్థను



మహిళలను అవార్డులతో సత్కరించిన జస్టిస్ సుధ, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

కాపాడి భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరముందన్నారు. ఎమ్మెల్సీ సురభి వాణీదేవి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, న్యాయ వ్యవస్థలో సైతం మహిళల భాగస్వామ్యం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అంతకు ముందు వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన 16 మంది మహిళలను అవార్డులతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు జయంత్ చల్లా, కవిత చల్లా, సురేందర్‌రెడ్డి, లోహిత్‌కుమార్, జగన్మోహన్ రెడ్డి, ఇందుప్రియ, రాజ్‌కుమార్, అమృత్ ముళ్ల పూడి, సూర్యచందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

బౌద్ధనగర్: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు సోమశేఖర్ మాదిగ డిమాండ్ చేశారు. మాదిగల సంగ్రామ యాత్రలో భాగంగా ఆదివారం బౌద్ధనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో 13వ రోజు యాత్ర కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఏప్రిల్ 3న బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముందు వేలాది మంది మాదిగలతో జరగబోయే మహాధర్నా విజయవంతానికి మాదిగ సంగ్రామ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 5న అంబర్‌పేట్ నియోజకవర్గం నుండి ప్రారంభమైన యాత్ర 13వ రోజు సికింద్రాబాద్ నియోజకవర్గంలోని బౌద్ధనగర్ డివిజన్‌లో



బౌద్ధనగర్‌లో మాదిగల సంగ్రాయ యాత్ర

కొనసాగిందన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే వర్గీకరణ చేస్తామన్న బీజేపీ ప్రభుత్వం దాదాపు తొమ్మిది సంవత్సరాలైనా వర్గీకరణ చేయకుండా మాదిగ, ఉపకులాల ప్రజలకు అన్యాయం చేస్తుందని ఆరోపించారు.యాత్రలో మల్లికార్జున్, యాదగిరి, శ్రీనివాస్, ఈశ్వర్ రావు, మురళీధర్, దినేష్, ఎడవెల్లి యాదయ్య, గజ్జల రాజశేఖర్, బడుగుల బాలకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతిపక్షాల తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టాలి

సనత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టాలని బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం జరిగిన సోషల్ మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడాలేని విధంగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. కొన్ని ప్రతిపక్ష పార్టీలు కేవలం రాజకీయ లబ్ధి కోసం వాట్సాప్, ఇన్‌స్టాగామ్ తదితర సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలు అవాస్తవమని ప్రజలకు కూడా అర్థమయ్యేలా దీటైన సమాధానాలతో తిప్పికొట్టాలని సాయికిరణ్‌యాదవ్ పేర్కొన్నారు.

ఓయూలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని సీ–హాస్టల్ 2002–08 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. యూనివర్సిటీ లైబ్రరీలోని ఐసీఎస్ఎస్ఆర్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు డాక్టర్ విద్యాసాగర్ అధ్యక్షత వహించగా టీఎస్ ఎంఎస్ఐడీసీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల నుంచి ఓయూకు వచ్చి ఉన్నత విద్యను అభ్యసించి ఎంతోమంది ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని గుర్తు చేశారు. అయితే ఏ స్థాయికి



మాట్లాడుతున్న ఎర్రోళ్ల శ్రీనివాస్

ఎదిగామన్నది ముఖ్యం కాదని.. ఎంతమంది ఆప్తలను సంపాదించుకున్నమన్నదే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రమణరావు, సత్యప్రసాద్, భానుప్రకాష్, తెలంగాణ శంకర్ పాల్గొన్నారు.

రోడ్లపై నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి



రోడ్లపై నిలిచిన నీటి గురించి గజ్జెల నాగేష్‌కు వివరిస్తున్న స్థానికులు

రసూల్‌పురా: రోడ్లపై నీరు నిల్వకుండా బోర్డు అధికారులు చర్యలు తీసుకుంటారని రాష్ట్ర బెవరేజీస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్ తెలిపారు. రసూల్‌పురా ఇందిరమ్మనగర్ పెద్ద రోడ్డులోని మూడు రోడ్ల కూడలిలో వర్షపునీరు, తాగునీటి పైపులైన్ లీకేజీ, డ్రైనేజీ నీరు రోడ్లపైకి భారీగా వచ్చింది. విషయం తెలుసుకున్న గజ్జెల నాగేష్ ఇందిరమ్మనగర్ చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గతేడాది నుంచి తాగునీటి పైపులైను లీకేజీ అవుతోందని బోర్డు అధికారులు, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సాద కేశవరెడ్డి, బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపించారు. బోర్డు సీఈవో మధుకర్‌నాయక్, వాటర్‌వర్క్స్ ఏఈ శశాంక్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని నాగేష్ కోరారు. వారం రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజు, మురళి, శివ యాదవ్, దయ్యాల యాదగిరి, బాబన్న, కమలమ్మ, పద్మ, బాలు, మల్లమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్‌లోని సెయింట్ సాయి హైస్కూల్ 9వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాదగిరి శేఖర్రావు, మధుసూదన్, సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం కన్వీనర్ టి. రాజశేఖరరెడ్డి, భారత్ వికాస్ పరిషత్ తెలంగాణ ప్రాంత్ అధ్యక్షులు నరేంద్రకృష్ణ, బీజేవైఎం జాతీయ కోశాధికారి సాయిప్రసాద్, ఎస్ఆర్‌కే గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ప్రిన్సిపల్ సుజాత, చైర్మన్ శివరామక్రిష్ణ పాల్గొని మాట్లాడారు. విలువలతో కూడిన విద్యాబోధన ద్వారా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు.

తాత్కాలిక నియామకాలపై విధించిన నిషేధాన్ని తొలగించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: యూనివర్సిటీలలో పర్మినెంట్ అధ్యాపకుల నియామకం కోసం రిక్రూట్‌మెంట్ బోర్డును ఏర్పాటును చేసి గవర్నర్ సంతకం కోసం అధికారులు ఎదురు చూస్తున్నారు. దీంతో నియామక ప్రక్రియాలలో జాప్యం జరుగుతుంది. ఇదిలా ఉండగా గవర్నర్ సంతకం పెట్టే వరకు తాత్కాలిక, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ అధ్యాపకులను నియమించకుండా రాష్ట్ర ప్రభుత్వం జీవోను జారీ చేసింది. దీంతో వర్సిటీలో నియామకాలు పూర్తిగా నిలిచిపోయి బోధన, ఇతర విధులకు తీవ్రమైన అధ్యాపకుల కొరత ఏర్పడి పనుల్లో జాప్యం జరుగుతుంది. తాత్కాలిక నియామకాలపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని విద్యార్థి నేతలు డిమండ్ చేస్తున్నారు.

నిరుపేదల అభ్యున్నతే కాంగ్రెస్ ధ్యేయం

సనత్‌నగర్: నిరుపేదల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడే కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతుందని, కేంద్రం, రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. బేగంపేటలోని పాటిగడ్డలో ఆదివారం నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న టీఆర్ఎస్ సర్కార్‌కు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ వాటిని పరిష్కరించే దిశగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తోందన్నారు. ఇబ్రాంపటేల్, విఠల్, మల్లికార్జున్, మహ్మద్ షంషీద్దీన్, హాజీటోచర్, ఐవాన్‌వాజ్, జాన్, కలీమ్, నజీర్, సుభాన్, మహేష్, షరీఫ్, రఫీక్, రమాదేవి, రియాజ్, ఆబేదాబేగం పాల్గొన్నారు.

సుదీర్ఘకాలంగా పని చేస్తున్న అధికారులు, సిబ్బందిని బదిలీ చేయాలి

లాలాపేట: హైదరాబాద్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సుదీర్ఘకాలంగా పని చేస్తున్న కిందిస్థాయి ఉద్యోగులు, సిబ్బందిని బదిలీ చేయాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా నగర ఉపాధ్యక్షులు నాచారం బల్‌రాం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా నగరంలోని కార్పొరేషన్‌లో తిష్టవేసి ఉన్న సిబ్బంది చేతి వాటాన్ని ప్రదర్శిస్తూ అక్కడి వచ్చే వారిని నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఉన్నతాధికారులను సైతం కలువనివ్వడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎక్కువ కాలం పాటు విధులు నిర్వహిస్తున్న వారిని వేరే ప్రాంతానికి బదిలీ చేయాలని లేకుంటే కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జన్ను కనకరాజు, వేముల బల్‌రాము పాల్గొన్నారు.

టీడీపీని బలోపేతం చేస్తాం

బౌద్ధనగర్: డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం డివిజన్ టీడీపీ అధ్యక్షుడు గరిగె ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటికి వెళ్లి తెలుగుదేశం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించినట్లు తెలిపారు.